# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 21, ఫిబ్రవరి 2026


## గురుకుల పాఠశాలల సమస్యల పరిష్కారానికి

# ప్రత్యేక చర్యలు

★ జిల్లా కలెక్టర్ కె హరిత

**తిర్యాని, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:**

జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె హరిత అన్నారు. శుక్రవారం జిల్లాలోని తిర్యాని మండలంలోని చింత పల్లిలో గల గిరిజన సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా సందర్శించి పాఠశాల తరగతి గదులు, మధ్యాహ్న భోజనం నాణ్యత, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, త్రాగునీరు, పరిసరాల పరిశుభ్రత అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతుందని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా కృషి చేస్తుందని తెలిపారు. వేసవికాలం సమీపిస్తున్నందున నీటి సమస్య లేకుండా నీటి లభ్యత ఉన్న ప్రాంతంలో బోర్ వెల్ ఏర్పాటు చేసే దిశగా గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, వంట సమయంలో సిబ్బంది పరిశుభ్రత నిబంధనలను పాటించాలని తెలిపారు. డార్మెటరీ గదిలో మౌళిక సదుపాయాలు కల్పించాలని, డ్రైనేజీ వ్యవస్థ పకడ్బందీగా నిర్వహించాలని, మూత్రశాలలకు తలుపులు ఏర్పాటు చేయాలని, మురుగు కాలువల నిర్మాణాలకు అంచనా ప్రతిపాదనలు రూపొందించాలని తెలిపారు. విధుల పట్ల సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేసి మరోసారి ఆలస్యం కాకుండా చూసుకోవాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులను మార్చాలని విద్యార్థులు కోరగా మిగతా 2లో..





# 40 రోజుల ముందే లక్ష్యం పూర్తి

✦ ఆర్.కె-న్యూటెక్ గని ఘనత ✦ రికార్డు స్థాయిలో 1.60 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి

✦ సిబ్బందిని అభినందించిన జీఎం శ్రీనివాస్

**నస్పూర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**

ఆర్.కె-న్యూటెక్ గని ఉద్యోగులు, అధికారులు ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ సింగరేణి ప్రగతిలో భాగస్వాములు కావాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్.కె-న్యూటెక్ గని వార్షిక నిర్దేశిత లక్ష్యాన్ని 40 రోజుల ముందే చేరుకోవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం గని ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన 1,60,000 టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని రికార్డు సమయంలో పూర్తి చేసిన సిబ్బందిని అభినందించారు. సంస్థ అభివృద్ధిలో గని ఉద్యోగుల సమిష్టి కృషి మరువలేనిదని కొనియాడారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే ఉత్సాహంతో అధికోత్పత్తికి కృషి చేయాలని అధికారులకు, ఉద్యోగులకు శ్రీనివాస్ సూచించారు. గనిలోని కొత్త సీమ్ నుంచి బొగ్గు వెలికి తీసేందుకు అవసరమైన ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు వెల్లడించారు. ఏరియాలోని ఇతర గనులు సైతం తమకు కేటాయించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని మిగతా 2లో..

# సింగరేణి కార్మికుల హక్కుల రక్షణే ఐఎన్టీయూసీ ధ్యేయం

❋ 22న జరిగే కార్మికుల మహాసభను విజయవంతం చేయాలి ❋ ఐఎన్టీయూసీ కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు

**నస్పూర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ నల్ల చట్టాలను ఎదుర్కోవడానికి, కార్మిక హక్కులను కాపాడుకోవడానికి సింగరేణి కార్మికులంతా ఏకమవ్వాలని ఐఎన్టీయూసీ కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు పిలుపునిచ్చారు. ఈ నెల 22న నిర్వహించనున్న సింగరేణి కార్మికుల మహాసభను పురస్కరించుకుని శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియాలోని గనులు, వివిధ విభాగాల్లో ఐఎన్టీయూసీ నాయకులు ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్ అధ్యక్షతన జరిగే ఈ మహాసభకు జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారు. స్థానిక శాసనసభ్యుడు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, ప్రజా ప్రతినిధులు విశిష్ట అతిథులుగా పాల్గొంటారు. కార్మికుల ప్రధాన సమస్యలు, లేబర్ కోడ్ల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించేందుకు ఈ సభను ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్లు శంకర్ రావు తెలిపారు. సింగరేణి మిగతా 2లో..



# దివ్యాంగ చిన్నారుల విజయాలు అందరికీ స్ఫూర్తిదాయకం

✣ జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య

– మంచిర్యాల, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త



2లో.

# నీడ కరువై ప్రయాణికుల అవస్థలు



❖ ఎండలో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

**దిలావర్పూర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా దిలావర్పూర్ ఎక్స్ రోడ్డు వద్ద బస్ స్టేషన్ లేకపోవడంతో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. బస్సుల కోసం గంటల తరబడి ఎండలో, వానలో ప్రయాణికులు రోడ్డుపైనే వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇన్నాళ్లూ మిగతా 2లో..

## గురుకుల పాఠశాలల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

**(మొదటిపేజీ తరువాయి)**

ప్రిన్సిపాల్‌ను వెంటనే ఇతర ప్రాంతానికి డిప్యూటేషన్‌పై పంపించి సీనియర్ ఉపాధ్యాయురాలు రమ్యకు ఇంచార్జ్ ప్రిన్సిపాల్ బాధ్యతలను అప్పగించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం నాణ్యత, విద్యా బోధన తీరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. గురుకులంలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఇంజినీరింగ్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికుల హక్కుల రక్షణే ఐఎన్టీయూసీ ధ్యేయం

**(మొదటిపేజీ తరువాయి)**

భవిష్యత్తు, పరిరక్షణే లక్ష్యంగా ఐఎన్టీయూసీ పనిచేస్తుందని స్పష్టం చేశారు. దేశవ్యాప్త బొగ్గుగని కార్మికుల సమస్యలు, వాటిని ఎదుర్కోవడానికి చేపట్టాల్సిన కార్యాచరణపై సంజీవరెడ్డి సభలో దిశానిర్దేశం చేస్తారని వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి గతంలో భూపాలపల్లి సభలో ప్రకటించిన సొంతింటి పథకం అమలు కోసం ఐఎన్టీయూసీ నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. అలవెన్సులపై ఆదాయపు పన్ను రద్దు, కార్పొరేట్ మెడికల్ బోర్డు పునరుద్ధరణ వంటి 15 కీలక డిమాండ్ల అమలుపై ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు సభలో క్షుణ్ణంగా వివరిస్తారని పేర్కొన్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో విజయం సాధించిన మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లను సభలో ఘనంగా సన్మానిస్తామని చెప్పారు. కార్మిక సంక్షేమం కోసం నిర్వహిస్తున్న ఈ మహాసభకు కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఐఎన్టీయూసీ నాయకులు భీమ్ రావు, గరిగ స్వామి, తిరుపతి రాజు, జీవన్ జోయల్, ల్యాగల శ్రీనివాస్, ఏనుగు రవీందర్ రెడ్డి, పేరం రమేష్, మల్లారెడ్డి, గోపాల్ రెడ్డి, కలవేణి శ్యామ్, భీమ్ రవి పాల్గొన్నారు.

## నీడ కరువై ప్రయాణికుల అవస్థలు

**(మొదటిపేజీ తరువాయి)**

అక్కడ ఉన్న చెట్లు నీడను ఇస్తూ ప్రయాణికులకు అండగా ఉండగా, ఇటీవల ఆ చెట్ల కొమ్మలను నరికివేయడంతో ఆ కాస్త నీడ కూడా కరువైంది. దీంతో పసిపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల కష్టాలు చూసి చెట్లు సైతం కన్నీరు పెడుతున్నట్లుగా అక్కడి పరిస్థితి కనిపిస్తోంది. రానున్నది వేసవి కాలం కావడంతో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నందున, అధికారులు స్పందించి కనీసం తాత్కాలిక బస్ షెల్టర్ నైనా ఏర్పాటు చేయాలని స్థానికులు, ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## 40 రోజుల ముందే లక్ష్యం పూర్తి

**(మొదటిపేజీ తరువాయి)**

కోరారు. గనుల్లో గైర్హాజరు శాతాన్ని తగ్గించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉత్పత్తితో పాటు రక్షణ సూత్రాలను పాటించడంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.కె-7 గనుల గ్రూపు ఏజెంట్ కుర్మ రాజేందర్, ఆర్.కె-న్యూటెక్ గని మేనేజర్ కూరపాటి శ్రీనివాసు, గ్రూపు ఇంజినీర్ మోహన్, రక్షణాధికారి కొట్టె రమేష్, పిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మయ్య, ఇంజినీర్ కృష్ణ, సంక్షేమాధికారి పాల్ సృజన్, షిఫ్టు ఇన్చార్జి పరమేశ్వర్ రావు, అండర్ మేనేజర్ దాట్ల శ్రీనివాస్, వెంటిలేషన్ అధికారి చంద్రమోళి, సర్వే అధికారి వీపీ రావు, కరుణాకర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సీఎం కప్ రెస్లింగ్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

**తాండూర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :**



రాష్ట్రస్థాయి సీఎం కప్ రెస్లింగ్ పోటీలకు తాండూర్ మండలం అచ్చలాపూర్ జెడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థిని చెల్ల హర్షిత ఎంపికైనట్లు పిడి సాంబమూర్తి తెలిపారు. ఈనెల 14న మంచిర్యాలలో నిర్వహించిన జిల్లా స్థాయి సీఎం కప్ రెస్లింగ్ పోటీలలో హర్షిత బంగారు పతకం (ప్రథమ బహుమతి) సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈనెల 21 నుండి 23 తేది వరకు హైదరాబాద్ లోని గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో జరిగే రాష్ట్రస్థాయి సీఎం కప్ రెజ్లింగ్ పోటీలలో పాల్గొంటుందన్నారు. ఈ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, ఏపిపిసి చైర్మన్ చిలకమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

# దివ్యాంగ చిన్నారుల విజయాలు అందరికీ స్ఫూర్తిదాయకం

**మంచిర్యాల, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**

దివ్యాంగ చిన్నారుల విజయాలు సమాజంలోని ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని వారి ప్రతిభకు నిదర్శనం అని జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య తెలిపారు. హైదరాబాద్ నగరంలోని గవర్నమెంట్ కాలేజ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ దోమలగూడలో ఈ నెల 17 వ తేదీన దివ్యాంగ విద్యార్థుల రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించగా, ఇందులో పాల్గొన్న జిల్లాకు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభను కనబరిచి పథకాలు సాధించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించిన దివ్యాంగ చిన్నారులకు మంచిర్యాల భవిత కేంద్రం నందు శుక్రవారం రోజున ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి అభినందించారు. ఈ సందర్భంగా విజేతలకు మెడల్స్ సర్టిఫికెట్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపి, భవిష్యత్తులో ఎలా రాణించాలో ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి స్ఫూర్తిదాయకమైన సూచనలు చేశారు. రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో జిల్లాకు చెందిన ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు ప్రతిభ కనబరిచి పథకాలు సాధించడం గర్వకారణం అని అన్నారు శారీరక పరిమితులను అధిగమిస్తూ ధైర్యంగా పోటీలలో పాల్గొని విజయాలు సాధించడం ఆదర్శప్రాయం అని అన్నారు దివ్యాంగ చిన్నారుల విజయాలు సమాజంలో సానుకూల దృక్పథాన్ని పెంపొందిస్తాయని తెలిపారు ఈ పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయి అన్నారు ఇటువంటి రాష్ట్ర స్థాయి పోటీలు వారికి మరింత ప్రోత్సాహాన్ని అందిస్తాయని తెలిపారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర స్థాయి పోటీలలో మంచిర్యాల జిల్లా నుంచి 14 మంది దివ్యాంగ విద్యార్థులు పాల్గొనగా, జిల్లా నుండి పాల్గొన్న విద్యార్థులలో తాండూర్ మండలానికి చెందిన ఎస్కే హీన అనే విద్యార్థికి 50 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ బహుమతి, లెమన్ అండ్ స్పూన్ అనే ఆటలో ద్వితీయ బహుమతి, లాంగ్ జంప్ విభాగంలో ద్వితీయ బహుమతి సాధించింది. అలాగే చెన్నూరు మండలానికి చెందిన రాజనాల అస్మిత అనే విద్యార్థినికి జిగ్ జాగ్ ఆటల పోటీలో ప్రథమ బహుమతిని సాధించారు. అదేవిధంగా రన్నింగ్, క్యారం బోర్డ్, స్లో రన్నింగ్ లాంటి విభాగంలో ఎస్కే ముజాకీర్, తాజ్ బాబు, రమ్యశ్రీ, వరుణ్ దేశ్, చిన్మహి అనే విద్యార్థులు ద్వితీయ తృతీయ బహుమతులను సాధించడం జరిగింది. ఆటల పోటీలలో గెలుపొందిన, పాల్గొన్న దివ్యాంగ చిన్నారులకు శుక్రవారం రోజున జిల్లా విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో మెడల్, ప్రశంసా పత్రమును అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాధికారితో పాటు జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్లు కె. చౌదరి, సత్యనారాయణ మూర్తి, భరత్, రాజ్ కుమార్, డిసిఈబి చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, మంచిర్యాల మండల విద్యాధికారి మాళవి దేవి, కాంప్లెక్స్ హెచ్ఎం బండి రమేష్, ప్రత్యేక ఉపాధ్యాయులు ఐఈఆర్‌పిలు, దివ్యాంగ విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ పర్యాటక అభివృద్ధికి సహకరించండి

### - మంత్రి జూపల్లికి కాంగ్రెస్ నేతల విన్నపం

**నిర్మల్, ప్రభాతవార్త:**



నిర్మల్ నియోజకవర్గంలోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని కోరుతూ జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో నియోజకవర్గ ఇంచార్జ్ కూచాడి శ్రీహరిరావు నేతృత్వంలో మంత్రిని కలిసిన బృందం.. వెంగ్వపేట గ్రామ చెరువును సాగునీటి ప్రాజెక్టుగా, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరారు. అదేవిధంగా మామడ మండలంలోని వాస్తాపూర్ జలపాతాన్ని పర్యాటక ప్రాంతంగా గుర్తించి తగిన వసతులు కల్పించాలని విన్నవిస్తూ, దీనివల్ల స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. నిర్మల్ ప్రాంతానికి పర్యాటక శోభ తీసుకురావాలని కోరిన ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సంతోష్, రమేష్ కుమార్, నాయకులు కొట్టే శేఖర్, మురళి, అజయ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### - జిల్లా కలెక్టర్ కె హరిత

**తిర్యాని, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:**



ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కె హరిత అన్నారు. శుక్రవారం తిర్యాని మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సిబ్బంది హాజరు పట్టిక, ఆసుపత్రిలోని వార్డులు, మందుల నిల్వలు, పారిశుద్ధ్య నిర్వహణ అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, అత్యవసరంగా వచ్చేవారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు అవసరమైన ఔషధ నిల్వలు అందుబాటులో ఉంచుకోవాలని, వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని తెలిపారు. అనంతరం తిర్యాని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి తరగతి గదులు, విద్యా బోధన తీరు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ వారి అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారి అంజయ్యను ఆదేశించారు. 10వ తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా అదనపు తరగతి గదులు నిర్వహించాలని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## క్రీడల్లో రాణించిన విద్యార్థుల ప్రతిభ అభినందనీయం

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:**

హైదరాబాద్ లో ఈ నెల 17వ తేదీన ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీలలో రాణించిన జిల్లా విద్యార్థుల ప్రతిభ అభినందనీయమని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఆటల పోటీలలో పాల్గొని జిల్లా జట్టు 2వ స్థానం సాధించినందున విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెడల్ షీల్డ్ లు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఇండోర్, అవుట్ డోర్ ఆటల పోటీలలో పాల్గొని జిల్లా జట్టు ద్వితీయ స్థానం సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చారని తెలిపారు. ఈ సాధనలో తమ వంతు పాత్ర పోషించిన ప్రతి ఒక్కరు అభినందనీయులని, మునుముందు జిల్లా పేరును ముందు వరసలో నిలబెట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల స్పోర్ట్స్ ఇన్చార్జి శాంతి కుమార్, ఐ ఈ ఆర్ పి లు సతీష్, సుజాత, రమణ, ప్రత్యేక విద్యావేత్త మహేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కంప్యూటర్లు అందించేందుకు సింగరేణి సంస్థ ముందుకు రావడం అభినందనీయం

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:**



సామాజిక బాధ్యతల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్లు అందించేందుకు సింగరేణి సంస్థ ముందుకు రావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో కార్పొరేట్ కంపెనీల బాధ్యతలో భాగంగా సింగరేణి సంస్థ జిల్లాలోని ప్రాథమిక పాఠశాలలలో ఎక్కువ విద్యార్థులు కలిగిన 4 పాఠశాలలకు కంప్యూటర్లు అందజేసే కార్యక్రమంలో భాగంగా సింగరేణి సంస్థ గోలేటి జనరల్ మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి తో కలిసి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు కంప్యూటర్లు, ప్రింటర్లు, సిపియు లను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యతలో భాగంగా సింగరేణి సంస్థ జిల్లాలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఎక్కువగా ఉన్న పాఠశాలలకు కంప్యూటర్లు అందించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో పాఠశాలలలో మౌలిక వసతుల కల్పనలో సహకారం అందించాలని తెలిపారు. సింగరేణి సంస్థ 11 కంప్యూటర్లు, 11 సిపియులు, 5 ప్రింటర్లు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల ప్రణాళిక సమన్వయకర్త అబిద్ అలీ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ నాయకులు చిల్లర రాజకీయాలు మానుకోవాలి

**- రామడుగు లక్ష్మణ్**

క్యాతన్‌పల్లి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త

కాంగ్రెస్ పార్టీ నాయకులు చిల్లర రాజకీయాలు మానుకోవాలని సి.పి.ఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం రామకృష్ణాపూర్ పట్టణ సి.పి.ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. క్యాతన్‌పల్లి చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక ప్రక్రియలో స్థానిక కాంగ్రెస్ నాయకులు చేస్తున్న దౌర్జన్యాలు అరాచకాలు ప్రజలు గమనిస్తున్నారని, ఈ ధోరణి అవలంబిస్తే ప్రజాక్షేత్రంలో చరిత్ర హీనులుగా మిగిలిపోతారని అన్నారు. మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రజా తీర్పును గౌరవించి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక పారదర్శకంగా జరిగేలా చూడాలని కోరారు. ఈనెల 11వ తేదీన జరిగిన మున్సిపాలిటీలో ఎన్నికలలో సిపిఐ, బిఆర్ఎస్ కూటమి 22 స్థానాలలో పోటీ చేయగా 14 స్థానాల్లో కూటమికి ప్రజలు బ్రహ్మరథం పట్టగా, కాంగ్రెస్ పార్టీ ఏడు స్థానాలలో గెలిచి దొడ్డిదారిన చైర్మన్ పీఠం దక్కించుకోవాలని కుటిల ప్రయత్నాలు చేస్తుందన్నారు. కూటమికి మెజారిటీ సభ్యులు ఉన్నప్పటికీ కాంగ్రెస్ అధికార అహంకారంతో పోలీసులు, అధికారులను తమ చెప్పు చేతల్లో పెట్టుకొని చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక లేకుండా సమావేశాన్ని రెండు సార్లు వాయిదా వేశారాని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి అభ్యర్థులను ప్రలోభాలకు గురి చేస్తూ భయం భంత్రులకు గురిచేసి, కౌన్సిల్ సభలో



మాట్లాడుతున్న సీ.పి.ఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్

ప్రమాణ స్వీకార అనంతరం బ్రేక్ పేరిట 30 నిమిషాలు కాలాయాపన చేశారని అన్నారు. మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ కాంగ్రెస్ కౌన్సిల్ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేయడం ఎన్నికల నియమావళిని తుంగలో తొక్కడమేనని అన్నారు. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను వాయిదా వేసే కుట్రలో భాగంగా గుర్రం శ్రీనివాస్‌ను ప్రేరేపించి హౌస్‌లో గొడవ అయ్యేవిధంగా, 8వ వార్డు కౌన్సిలర్ మునిని పై దాడి చేయించడం, బెదిరించడం చేశారని ఆరోపణలు చేశారు. సిపిఐ, బిఆర్ఎస్ కౌన్సిల్ సభ్యులు మంత్రి వివేక్‌ను వేడుకుంటూ ఇదేమి సంస్కృుతి సార్ మీకు దండం పెడతామని, ఎంత బతిమిలాడినా చోద్యం చేస్తూ చూశాడే తప్ప మరి ఏమి చేయలేదన్నారు. ప్రత్యేక ఎన్నికల అధికారి, మందమర్రి తహశీల్దార్ సతీష్ సమక్షంలో ఎస్టీ కులానికి చెందిన కౌన్సిలర్ మునిపైన దాడి చేయడం, మహిళా కౌన్సిలర్ పై కౌన్సిల్ సభ్యులపై దాడి చేశారని, దాడి చేసిన వారి పై అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని అధికారులను కోరారు. కౌన్సిల్ హాల్‌లో ఉన్న సీసీ ఫుటేజీలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి పౌల్, కాదండి సాంబయ్య, వనం సత్యనారాయణ, నక్క వెంకట స్వామి, ఏగుడ మొండి, మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి గాజుల మణెమ్మ, సిపిఐ నాయకులు, బండారి రాజేశం, కారుకూరి రాయలింగు, గుమ్ముల శ్రీనివాస్, సంకే లక్ష్మణ్, మాదాస్ శంకర్, భాస్కర్, నరేష్, తోకల రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

## నేడు సారంగాపూర్, నిర్మల్‌లో గల్ఫ్ అడ్వైజరీ కమిటీ పర్యటన

సారంగాపూర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్ర గల్ఫ్ ఎన్నారై పాలసీ రూపకల్పనలో భాగంగా, వలస కార్మికుల సమస్యలపై సమగ్ర అధ్యయనం చేసేందుకు ఎన్నారై అడ్వైజరీ కమిటీ శనివారం సారంగాపూర్ మండలం, నిర్మల్ జిల్లా కేంద్రంలో పర్యటించనుంది. ఈ మేరకు కమిటీ సభ్యులు స్వదేశ్ పరికిపండ్ల వివరాలు వెల్లడించారు. అంబాసిడర్ డాక్టర్ బి.ఎం. వినోద్ కుమార్ అధ్యక్షతన, మంద భీంరెడ్డి, ఇతర సభ్యులతో కూడిన బృందం ఉదయం సారంగాపూర్ మండలంలోని పలు గ్రామాలను సందర్శించనుంది. అనంతరం మండల కేంద్రంలోని రైతు వేదికలో గల్ఫ్ కార్మికులు, వారి కుటుంబాలతో సమావేశమై వారి అనుభవాలు, సమస్యలపై ప్రత్యక్షంగా సమాచారం సేకరిస్తారు. మధ్యాహ్నం నిర్మల్‌లో జిల్లా కలెక్టర్, ఎస్పీ, వివిధ శాఖల అధికారులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా హైదరాబాద్ సెస్ సంస్థకు చెందిన పరిశోధకులు కూడా పాల్గొంటారని, స్థానిక అధికారులు వీరికి సహకరించాలని కోరారు.




## రేపు టీజీ సెట్ ప్రవేశ పరీక్ష

సారంగాపూర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను ఐదవ తరగతి ప్రవేశ పరీక్ష ఈ నెల 22న ఆదివారం నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు మొత్తం 504 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి. సంగీత ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ముందుగానే తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని, పరీక్షా కేంద్రానికి వచ్చేటప్పుడు ఎగ్జామ్ ప్యాడ్, పెన్నులు వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఉదయం 9:30 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, సమయం మించితే అనుమతించబడదని ఆమె స్పష్టం చేశారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించాలని ఈ సందర్భంగా ఆకాంక్షి ంచారు.

## పెండింగ్ కేసుల పరిష్కారంలో న్యాయవాదులు సహకరించాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

కోర్టులో పెండింగ్ లో ఉన్న కేసుల పరిష్కారంలో త్వరగా పూర్తి చేయడంలో న్యాయవాదులు కూడా సహకరించాలని జిల్లా కోర్టు పూర్తి అదనపు ప్రధాన న్యాయమూర్తి వీరయ్య పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని స్థానిక బార్ అసోసియేషన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆసిఫాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఇన్చార్జ్ బాధ్యతలు స్వీకరించినందుకు సంతోషంగా ఉందన్నారు. అంతకుముందు సీనియర్ సివిల్ జడ్జ్ యువరాజు మాట్లాడుతూ ఆసిఫాబాద్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఎప్పుడూ పని విషయంలో వెనుక పోరని, బెంచ్ అండ్ బార్ ను చాలా సవ్యంగా నడుపుతారని కొనియాడారు. అనంతరం ఆసిఫాబాద్ బార్ అసోసియేషన్ సభ్యులు ప్రధాన న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందించి శాలువ కప్పి సన్మానించారు. గతంలో జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన ఎంవి రమేష్ బదిలీపై వెళ్లారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ముక్తా సురేష్, తాటిపల్లి సురేష్, బోనగిరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కోర్టు పూర్తి అదనపు ప్రధాన న్యాయమూర్తి వీరయ్య



వార్షికోత్సవంలో పాల్గొన్న ఫాదర్లు, క్రైస్తవులు

## ఘనంగా చర్చి వార్షికోత్సవ వేడుకలు

తాండూర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :

మండలంలోని మాదారంటౌన్ షిప్ లో గల ఏ. బి .నేజర్. ఏ. జి. చర్చి పదవ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. క్రైస్తవ మత పెద్దలు ప్రేమ్ కుమార్ ఏసుక్రీస్తు యొక్క జీవిత చరిత్ర, ఏసుక్రీస్తు బోధనలు వివరించారు. పాస్టర్, క్రైస్తవులు కేక్ కట్ చేసి వేడుకలుస్తున్న జరుపుకున్నారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్ పాల్ డేవిడ్, వివిధ చర్చిల ఫాదర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.



చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేస్తున్న ప్రజా ప్రతినిధులు

## అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన

తాండూర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త

మండలంలోని మాదారం 3 అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన వేడుకలు నిర్వహించారు. సర్పంచ్ కుశ్నపల్లి లక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ సూరం దామోదర్, సి.డి.పి.ఓ స్వరూప ముఖ్య అతిథిలు హాజరై అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేయించారు. సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యురాలిని ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఇందిరా, అంగనవాడి టీచర్ మీనా, వార్డు సభ్యురాలు సౌమ్య, తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకార సంఘం నుంచి బహిష్కరించారని బాధితుల ఆవేదన

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని నర్సాపూర్ గ్రామంలో తమను మత్స్యకార కుల సంఘం నుండి అన్యాయంగా బహిష్కరించారని ఎనిమిది మంది సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం లక్ష్మణచాందలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు మాట్లాడుతూ.. సంఘ భవన నిర్మాణానికి సంబంధించిన లెక్కలు అడిగినందుకు సంఘ సభ్యుడు పడిగల మైపాల్ తమపై కక్ష గట్టి బహిష్కరణకు గురిచేశారని వాపోయారు. సంఘం నుండి తొలగించడమే కాకుండా తమను మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై ఇప్పటికే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు, తహసిల్దార్ కార్యాలయంలోని ఆర్ఐకి వినతిపత్రం అందజేశామని తెలిపారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాధితులు భీమన్న, పోశెట్టి, పుట్టి ముత్తవ్వ, నిఖిత, మమత తదితరులు పాల్గొన్నారు.

## టోర్నమెంట్ విజేతలకు బహుమతుల ప్రధానం

పెంచికల్ పేట్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :

పెంచికల్ పేట్ మండలంలోని గోంట్లపేట్ గ్రామంలో నిర్వహిస్తున్న గ్రామస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ శుక్రవారంతో ముగిసింది. ఫైనల్ మ్యాచ్ లో గోంట్లపేట్, తలాయి జట్లు పాల్గొనగా, గోంట్లపేట్ విన్నర్, తలాయి రన్నర్ గా నిలిచాయి. బహుమతుల ప్రధానోత్సవంలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పాల్గొని మొదటి బహుమతి రూ. 15000వేల, రెండవ బహుమతి రూ. 10000 నగదుతో పాటు ట్రోపిలను ఇరు జట్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసికొల్లాసనికి దోహదపడతాయని, యువకులు క్రీడాల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు దుర్గం పోషన్న, చౌదరి శ్రీనివాస్, కౌన్సిలర్ రవి, నాయకులు బండన్న, షేక్ బాబు, సాజీత్, శ్రీనివాస్, వెంకటాచలం, క్షేత్ర చిట్ ఎండి ఎంబంటి అంజన్న, మేనేజర్ బండి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న కోనప్ప

# సెక్యూరిటీ టెండర్లలో నిబంధనల ఉల్లంఘనల ఆరోపణలు

**- సిపిఐ నేత కెమెరా దుర్గరాజ్**

**మందమర్రి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**



మందమర్రి పట్టణ సిపిఐ కార్యదర్శి కామెరా దుర్గ రాజ్ సెక్యూరిటీ టెండర్ల వ్యవహారంపై తీవ్ర ఆరోపణలు చేశారు. మందమర్రి ఏరియాలో 90 మంది అవుట్ సోర్సింగ్ సెక్యూరిటీ గార్డుల నియామకం కోసం నిర్వహించిన టెండర్లలో భారీ అక్రమాలు జరుగుతున్నాయని ఆయన విమర్శించారు. రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి అర్హత లేని సంస్థలకు టెండర్లు కట్టబెట్టేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ, మాధవ్ సెక్యూరిటీ సర్వీస్, తిరంగ సెక్యూరిటీ అండ్ అవుట్ సోర్సింగ్ సర్వీసెస్ సంస్థలకు సరైన ధృవీకరణ పత్రాలు లేవని పేర్కొన్నారు. అధికార పార్టీకి చెందిన మంత్రులు, నేతల అండతో అధికారులపై ఒత్తిడి తెచ్చి ఫైళ్లను వేగంగా కదిలిస్తున్నారని ఆరోపించారు. ఎల్1 కాంట్రాక్టర్ టెండర్ డ్రా విధానంలో ఎంపికైన తర్వాత హోమ్ డిపార్ట్మెంట్‌కు చెందిన పసర లైసెన్స్‌ను ఒక్క రోజులోనే సృష్టించి సమర్పించారని దుర్గరాజ్ తెలిపారు. వర్క్ ఆర్డర్ తేదీలు, జీఎస్టీ వివరాలు పొంతన లేకుండా ఉన్నాయని, ఈఎస్ఐ, పీఎఫ్ బిల్లులు, బ్యాంక్ స్టేట్మెంట్లను నిశితంగా పరిశీలించాలని డిమాండ్ చేశారు. ఎల్2 కాంట్రాక్టర్ విషయంలో ఫైనాన్షియల్ ఇయర్‌లో ఒక నెల తక్కువగా ఉన్నప్పటికీ, పసరా లైసెన్స్ వచ్చి రెండు నెలలు కూడా కాకముందే ఏడాది అనుభవం ఉన్నట్లు పత్రాలు సమర్పించడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీస్ రెగ్యులేషన్ యాక్ట్ 2005 ప్రకారం లైసెన్స్ రాకముందు చేసిన పని అనుభవంగా చెల్లదని స్పష్టం చేశారు. కొన్ని సంస్థలు పని చేయకపోయినా చేసినట్లు తప్పుడు పత్రాలు సృష్టించాయని ఆరోపిస్తూ, అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు. పూర్తి స్థాయి అర్హతలు, డాక్యుమెంట్లు ఉన్న సంస్థలకే టెండర్ కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ వ్యవహారంపై మందమర్రి జనరల్ మేనేజర్ తక్షణమే స్పందించి సమగ్ర తనిఖీలు చేపట్టాలని కోరారు.

## స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తుల స్వీకరణ

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:**

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన ఎస్టీ విద్యార్థులు 202526 విద్యా సంవత్సరమునకు గాను విదేశాల్లో ఉన్నత విద్యను చదివేందుకు స్కాలర్ షిప్ కోసం దరఖాస్తులు తీసుకుంటున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ అధికారి, ఉప సంచాలకులు రమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం ద్వారా స్కాలర్షిప్ కోసం అంతర్జాలంలో ఈ పాస్ ద్వారా మార్చ్ 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని గిరిజన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



రైతులతో కలిసి పత్తి చేనును పరిశీలించిన కోనప్ప

## పత్తి కొనుగోలు గడువు పెంచాలి: మాజీ ఎమ్మెల్యే కోనప్ప

**పెంచికల్‌పేట్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :**

పత్తి కొనుగోలు గడువును మార్చి నెల 15 వరకు పొడిగించాలని కోరారు. సీసీఐ అధికారులు ఫిబ్రవరి 20తో కొనుగోళ్లు ముగిస్తున్నట్లు ప్రకటించడంతో రైతులకు నష్టం వాటిల్లుతుందని తెలిపారు. శుక్రవారం పెంచికల్ పేట్ మండలంలోని పత్తి చేనులను రైతులతో కలిసి పరిశీలించిన ఆయన, వర్షాల ఆలస్యం, కార్మికుల కొరతతో అనేక గ్రామాల్లో పత్తి తీయడం పూర్తికాలేదని చెప్పారు. తీసిన పత్తిని మార్కెట్ కు తరలించేందుకు కూడా సమయం సరిపోవడం లేదన్నారు. రైతులు కనీస మద్దతు ధరకు పత్తి విక్రయించేలా సీసీఐ వెంటనే స్పందించి గడువును పొడగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట సర్పంచు చౌదరి శ్రీనివాస్, నాయకులు జాజిమొగ్గ శ్రీనివాస్, బండన్న, వెంకటాచలం, షేక్ బాబు, మారయ్య తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి మహిళా కళాశాలలో సందడి చేసిన ఫేర్వెల్ సంబరాలు

**మందమర్రి, ఫిబ్రవరి20, ప్రభాతవార్త**

మందమర్రి పట్టణంలోని అందుగులపేటలో గల సింగరేణి మహిళ జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలలో ఫేర్వెల్ పార్టీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణం విద్యార్థినుల ఉత్సాహంతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం విద్యార్థినులతో పాటు డిగ్రీ విద్యార్థినులు పాల్గొన్నారు. ముఖ్యంగా చివరి సంవత్సరం విద్యార్థినులు తమ కళాశాల అనుభవాలను స్మరించుకుంటూ భావోద్వేగంగా ప్రసంగించారు. కళాశాలలో గడిపిన స్మృతులను పంచుకుంటూ, విద్యాభ్యాసంతో పాటు వ్యక్తిత్వ వికాసానికి ఈ విద్యాసంస్థ ఎలా దోహదపడిందో వివరించారు. అలాగే కళాశాల ప్రగతిని, సాధించిన విజయాలను మొదటి సంవత్సరం విద్యార్థినులకు వివరించి వారికి ప్రోత్సాహం కల్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జానపద గీతాలు, సినీ పాటలపై విద్యార్థినులు అద్భుత నృత్య ప్రదర్శనలు ఇస్తూ అందరినీ అలరించారు. సభలో చప్పట్లు మార్మోగాయి. ముఖ్య అతిథిగా కళాశాల కరస్పాండెంట్ హీరాలాల్ ఉపాధ్య పాల్గొని మాట్లాడుతూ క్రమపద్ధతితో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని సూచించారు. గత సంవత్సరం పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను జ్ఞాపికలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాళ్లు చందు యాదవ్, సి.హెచ్. రాజం, అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.





మహిళా సంఘ సభ్యులతో మాట్లాడుతున్న ఏపిఎం సూర్యకాంత్

## మహిళలు వ్యాపార రంగంలో రాణించాలి

**లింగాపూర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:**

లింగాపూర్ మండలం కంచన్పల్లి గ్రామంలో, మహిళా సంఘాలకు, జీవన ఉపాధి కల్పనపై ,అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ,సూర్యకాంత్ సదస్సు నిర్వహించారు. మహిళలు కేవలం సంఘాలకు పరిమితం కాకుండా వ్యాపార రంగంలో రాణించాలని తెలిపారు. ఉపాధి అవకాశాలను అంది పుచ్చుకొని ఆర్థికంగా ఎదగాలని దిశా నిర్దేశం చేశారు. ప్రతి సంఘ మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్లు మడవి ప్రదీప్. బ్రాక్ మండల కోఆర్డినేటర్ రవీందర్. వివోఏలు మహిళా సంఘాల సభ్యులు సరస్వతి. కౌసల్యాబాయి. మున్నిబాయి. తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో కొలువుదీరిన అభయాంజనేయ స్వామి

## అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం

**పెంచికల్ పేట్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**

పెంచికల్ పేట్ మండలంలోని బొంబాయిగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం శుక్రవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. వేదపండితుడు బాచంపల్లి కమలాకర్ శర్మ ఆధ్వర్యంలో మంత్రోచ్చారణల మధ్య యాగాలు, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులు పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప స్వామివారిని దర్శించి ఆశీర్వచనం పొందారు. అనంతరం అయనను అర్చకులు, కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

## మంచిర్యాలలో ఈనెల 25న పట్టుబడ్డ వాహనాల వేలం

**మంచిర్యాల,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త**

మంచిర్యాల ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను ఈనెల 25న ఉదయం 10 గంటలకు వేలం వేయనున్నట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ గురువయ్య తెలిపారు. స్టేషన్ ఆవరణలో నిర్వహించే వేలంపాటలో ఆసక్తి గలవారు పాల్గొనాలని తెలిపారు. పూర్తి వివరాలకు స్టేషన్‌లో సంప్రదించాలని ఒక ప్రకటనలో తెలియజేశారు.

## రెండు విడతలుగా వార్డు సభ్యులకు శిక్షణ

**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట మండలంలోని అన్ని గ్రామాలలో ఉన్న వార్డు సభ్యులకు రెండు విడతలుగా శిక్షణ ఇవ్వనున్నామని ఎంపీడీవో సరోజ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. మండలంలో ఉన్న 160 మంది వార్డు సభ్యులలో 80 మంది చొప్పున శిక్షణ ఇస్తామన్నారు. పట్టణంలోని రైతు వేదికలలో ఫిబ్రవరి 23 నుంచి 28 వరకు, మార్చి 3 నుంచి 8 వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఆ శిక్షణకు వార్డు సభ్యులు సూచించిన తేదీల్లో తప్పకుండా రావాలని ఆమె కోరారు.

## పురగిరి క్షత్రియ మండల సంఘం నూతన అధ్యక్షుడిగా కానగంటి శివలింగు ఏకగ్రీవ ఎన్నిక

**జన్నారం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**

జన్నారం మండలం పురగిరి క్షత్రియ మండల సంఘం నూతన అధ్యక్షుడిగా కానగంటి శివలింగును సంఘ సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల ప్రక్రియ మంచిర్యాల జిల్లా కమిటీ అధ్యక్షులు బొడ్డు శంకర్, ప్రధాన కార్యదర్శి చుంచు రాజుకిరణ్, బొడ్డు తిరుపతి, సంగా మనయ్య, చెల్లా విశ్వం, పయ్యావుల ముని ఆద్వర్యంలో సజావుగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీలో గౌరవ అధ్యక్షులుగా ఎంబడి సత్యం, ప్రధాన కార్యదర్శిగా గూడ అశోక్ లను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సంధర్బంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన శివలింగు మాట్లాడుతూ సంఘం అభివృద్ధి, సభ్యుల సంక్షేమం, యువతలో చైతన్యం నింపడంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం లాంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తనని తెలిపారు. సంఘం బలోపేతానికి అందరి సహకారం అవసరమని , పరస్పర ఐక్యతతో ముందుకు సాగితే మంచి పురోగతి సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జన్నారం మండల పురగిరి క్షత్రియ సంఘానికి చెందిన ప్రజాప్రతినిధులు, పెద్దలు, యువకులు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.



నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కానగంటి శివలింగును సన్మానిస్తున్న దృశ్యం